క్లుప్తంగా

పారదర్శకంగా సచివాలయ సేవలు అందించాలి

కొల్లిపర: సచివాలయ సేవలు అర్హత ప్రమాణికంగా ప్రజలందరికీ అందించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, తహసీల్దారు జి.నాంచారయ్య సచివాలయం సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని 3వ సచివాలయాన్ని వారు తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, సచివాలయ సేవలను మరింత విస్తృత పరచాలని సూచించారు. రికార్డులు పరిశీలించి, ప్రతి విషయం రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కళాధరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



తెనాలిటౌన్: బోసు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు వెంకటేశ్వర యోగి గురూజీ ఆశీస్సులతో టీటీడీ దాసా సాహిత్య ప్రాజెక్టు గుంటూరు, కృష్ణాజిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, ఉషారాణి దంపతుల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ ఎం.రమణయ్య తెలిపారు. కుర్రా శ్రీను, కొల్లిపల్లి బూసిరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

డాక్టర్ యోబు సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: డాక్టర్ కోడూరు యోబు దేవుని సేవ చేస్తు ఎందరికో ఆదర్శంగా నిలిచారని తెలుగు బాప్టిస్ట్ సంఘం అధ్యక్షుడు సొపాటి ఐయ్యన్న పేర్కొన్నారు. ఇటీవల మరణించిన తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి యోబు అదరణ కూడికను చినరావూరులో శనివారం నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అతని సతీమణికి బాప్టిస్ట్ చర్చిల తరపున కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు రెవరెండ్ పిడపర్తి సునీల్ కుమార్, కూచిపూడి బాబురావు, పి.చిట్టిబాబు, సొపాటి రాజేందర్, మెరుగుపాల నిరంజన్ పాల్, కె.జయన్న పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం, ఆనందం

దావులూరు(కొల్లిపర): ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఒక గంట సమయం సైకిల్ తొక్కటం వల్ల మానసిక ఆరోగ్యం, ఊబకాయం, మతిమరుపు వంటి అనేక రోగాల బారినుంచి బయటపడవచ్చు అని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీ సుధ అన్నారు. శనివారం మండలంలోని దావులూరు గ్రామంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీ సందర్భంగా గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు శారీరక శ్రమ లేని కారణంగా 63శాతం మంది అసంక్రమిత వ్యాధులతో నిత్యం చనిపోతున్నారని ఆరోగ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. శారీరిక శ్రమతో పాటు ఎక్కువగా తాగు నీరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, హెచ్‌వీపీ బాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి.చిలకాభారతి, సిబ్బంది అంజనేయ శాస్త్రి, సి.శ్రీనివాసరావు, ఫార్మసిస్ట్ బొమ్ము కోటిరెడ్డి, ఆశ కార్యకర్తలు జ్యోతి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో బాల కార్మిక చట్టంపై అవగాహన

తెనాలిరూరల్: పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ శనివారం సాయంత్రం బుర్రిపాలెం గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, నియంత్రణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో చేర్చడం, పనులు చేయించడం నేరమని వివరించారు. అందుకు సంబంధించి శిక్షలు, జరిమానాలను వెల్లడించారు. ఉచిత న్యాయ సహాయం పొందడంపై వివరాలు తెలిపారు.

గాంధీ కలలుగన్న.. గ్రామ స్వరాజ్యం

- పల్లె చెంతకే పాలన తెచ్చిన సీఎం వైఎస్ జగన్
- గ్రామ సచివాలయాలతో సొంత ఊరిలోనే సమస్యలకు పరిష్కారం
- పథకాల మంజూరుకు అర్హతే ప్రామాణికం..
- అవినీతికి ఆస్కారం లేకుండా.. 545 సేవలు



మున్నంగి గ్రామ సచివాలయం-2

కొల్లిపర: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వపరిపాలన సాకరమైంది. పల్లెకు సచివాలయ పాలన వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రతి 2వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం ఏర్పాటు చేశారు. వేల రూ.కోట్లతో కార్యాలయాల భవనాలు నిర్మించారు. నూతన భవనాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. 545 రకాల సేవలతో ప్రజల మన్ననలను సచివాలయ సిబ్బంది పొందుతున్నారు.

సచివాలయం నిర్మాణం ఇలా

సచివాలయానికి రూ.40 లక్షలు, సబ్ సెంటర్‌కు రూ.17.5 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.23 లక్షలు, పాల కేంద్రానికి రూ,14 లక్షలు చొప్పున ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయ పరిధిలో సుమారు రూ.95 లక్షలు వెచ్చించింది.

సమస్యల సత్వర పరిష్కారం

సచివాలయంలో జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లను ప్రజలు పొందుతున్నారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లయిస్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, హౌసింగ్, ఆధార్, లేబర్ డిపార్ట్‌మెంట్ సేవల కోసం అర్జీలు దాఖలు చేసినవారికి నిర్దేశించిన సమయానికి ధృవ పత్రాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం.. మండల కేంద్రానికి వెళ్లాల్సిన ప్రయాస ప్రజలకు పూర్తిగా తప్పిపోయింది. ఊరిలోనే..ఇంటికే వలంటీరు వచ్చి... పథకానికి అర్హత ఏంటి, ఏ పథకం వర్తిస్తుంది తదితర విషయాలను వివరించి, వారే ప్రజలచేత దరఖాస్తు చేయిస్తున్నారు. గడప దాటాల్సిన పనిలేకుండా పింఛన్లు, రేషన్, ఇంటి వద్దకే అందుతున్నాయి. ప్రతి సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి వలంటీర్లే అవసరమైన ధృవీకరణ పత్రాలు సేకరిస్తారు. పంచాయతీ సెక్రటరీ (గ్రేట్ 6 డిజిటల్ అసిస్టెంట్)కు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం ప్రభుత్వం నిర్ణీత గడువు లోగా.. దరఖాస్తును అధికారులు పరిశీలించి అర్హత ఉంటే వెంటనే ఆమోదిస్తున్నారు.

మండలంలో 15 గ్రామ సచివాలయాలు

కొల్లిపర మండలంలో 15 గ్రామ సచివాలయాలున్నాయి. అత్తోట వల్లభాపురం 1, 2, మున్నంగి 1, 2 పిడపర్రు, కొల్లిపర 1, 2, 3, అన్నవరం, బొమ్మువానిపాలెం, చివలూరు, తూములూరు, దావులూరు, చక్రాయపాలెంలో సచివాలయాలున్నాయి. వివిధ శాఖల 160 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు నిత్యం కార్యాలయంలో ఉండి, ప్రజల నుంచి అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, కొన్ని గంటలకే ధృవీకరణకు అవకాశం కల్పిస్తున్నారు.

ప్రజల చెంతకే పథకాలు అందిస్తున్నాం



సచివాలయలతో పల్లెల్లో ప్రజా పాలన ప్రారంభమైంది. వలంటీర్ల సహకారంతో రేషన్‌కార్డు మొదలు రైతన్నలకు, వృద్ధులకు, గ్రామ ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు, ఫించన్లు, రైతు భరోసా ఇలా అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఫలితంగా మండల కేంద్రానికి వెళ్లకుండానే ప్రజా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు అందుతున్నాయి.

– పి.శ్రీనివాసులు, ఎంపీడీవో, కొల్లిపర మండలం.

సచివాలయాల్లోనే సమస్యల పరిష్కారం



సమస్యలు ఉంటే సచివాలయానికి వెళ్లి వివరిస్తున్నాం. సరైన దృవ పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే.. వెంటనే సమస్య పరిష్కరిస్తున్నారు. గతంలో ఒక పనికోసం అనేక సార్లు మండల కేంద్రానికి వెళ్లి ఆ సమస్య తీరక విసిగిపోయేవాళ్లం. ఇప్పటి వరకు నేను సచివాలయం ద్వారా పట్టాదారు పాస్ పుస్తకం, అడంగల్ వంటి సేవలు పొందాను. చాలా సంతృప్తిగా ఉంది.

– గుదిబండి జయంత్‌రెడ్డి, రైతు, గుదిబండివారిపాలెం.

మండలానికి వెళ్లే పనిలేదు...



నేను సచివాలయంలో దరఖాస్తు చేసి రైతుభరోసా సాయాన్ని అందుకున్నాను. సచివాలయానికి వెళ్లి రైతు భరోసా, ఇంటి స్థలం, ఫింఛన్లకు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి సిఫార్సు లేకుండానే వెంటనే మంజూరు చేస్తున్నారు. గతంలో మండల కేంద్రానికి ఒకరిని తోడుగా తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అటువంటి సమస్యలు లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కొల్లి పద్మావతి, మహిళ రైతు, తూములూరు.

12న విద్యా కానుక కిట్ల పంపిణీ

రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.సుబ్బారావు

తెనాలిఅర్బన్: పాఠశాలలు పున:ప్రారంభం రోజు జూన్ 12న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయటం జరుగుతుందని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.సుబ్బారావు పేర్కొన్నారు. తెనాలి కొత్తపేట బాయ్స్ హైస్కూల్‌లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు తెనాలికి చేరిన కిట్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిశీలించారు. తెనాలి పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో 12,041 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వారందరికి విద్యాకానుక పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రాని వస్తువులను కూడా త్వరలో తెనాలి పంపటం జరుగుతుందని వివరించారు. ఈ నెల 6 నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వాటిని పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల వివరాలు ఆన్‌లైన్‌లో తెలియజేయాలని కోరారు. అలా చేయని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ సుబ్బారావు

అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం ర్యాలీ

తెనాలి: అంతర్జాతీయ సైకిల్ దినోత్సవాన్ని శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల నుంచి బుర్రిపాలెం వరకు సైకిల్ ర్యాలీని జరిపారు. సైకిల్ తొక్కడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నివారించటమే కాకుండా వ్యాధులను నియంత్రించవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.కళ్యాణ్ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.లక్ష్మీదుర్గ, ఎ.సోనీ ప్రియాంక పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకుడి అరెస్ట్

తెనాలిరూరల్: పట్టణంలో సింగల్ నంబరు లాటరీ నిర్వాహకుడు ఈశ్వరరావును వన్‌టౌన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో లాటరీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడు ఇచ్చిన సమాచారంతో పొన్నూరు, తెనాలి రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేయాల్సి ఉందని సీఐ కె.చంద్రశేఖర్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ



తెనాలిఅర్బన్: కాళీమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శనివారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నార

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

కొల్లిపర: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీడీవో పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న లే అవుట్‌లో ఇళ్ల పట్టాలు, గృహాలు మంజూరైన లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి లబ్ధిదారు తప్పని సరిగా గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించటం జరుగుతుందన్నారు. ఇళ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. బిల్లులు విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు అని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జి.నాంచారయ్య, పంచాయతీ కార్యదర్శి బార్గవ, కాంట్రాక్టర్ బొమ్ము నాగిరెడ్డి, ఏపీఎం ప్రియదర్శిని పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పనికి తగిన వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ నెల 9 వరకు జరిగే ప్రచార జాతలో అందరు పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తెనాలి గౌరవ అధ్యక్షుడు షేక్ హుస్సేన్‌వలి, ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.పద్మ, కంచర్ల సుశీల, ఎం.నాగరాజు, ఎం.పద్మావతి, మరియమ్మ, సరళ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నేతాజీ

97 శాతం పింఛన్‌ల పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం 97 శాతం పూర్తి అయింది. శనివారం వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీలు, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. చినరావూరుకు చెందిన టి నాగమ్మ ఎరుకలపూడిలోని అయుర్వేద వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెసుకున్న వెల్ఫేర్ సెక్రెటరీ ఎ.తిరుపతిరావు అక్కడికి వెళ్లి అమెకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. అలాగే ముత్తింశెట్టిపాలేనికి చెందిన పుట్ల ఆనందకుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు రూ.10వేల నగదును వలంటీర్ శ్యామ్‌బాబు అందజేశారు.



కిడ్నీ బాధితుడు ఆనంద కుమార్‌కు పింఛను అందజేత

నేడు ఉపకార వేతనాల పంపిణీ

తెనాలి: రజక వలంటరీ సర్వీస్ సొసైటీ (ఆర్‌వీఎస్) ఆధ్వర్యంలో పదోతరగతి ఉత్తీర్ణులైన 101 మంది విద్యార్థులకు ఉప కారవేతనాలు, బ్యాగులు, నోట్ పుస్తకాలు, వాటర్ బాటిల్స్, డ్రెస్ మెటీరియల్స్‌ను ఆదివారం పంపిణీ చేయనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు పటేటి శ్రీనివాస్, కొల్లూరు శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విద్యార్థులకు వాటిని అందజేస్తారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం, పాతపాటి అంజిబాబు, బొప్పరాజు వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాసరావు, విశ్రాంత ఎస్పీ బాల వెంకటేశ్వరరావు, కాకినాడ అడిషనల్ కమిషనర్ నాగనరసింహరావు పాల్గొంటారని తెలిపారు. 96660 35676, 94411 14978 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: పట్టణ రామలింగేశ్వరపేట తోటవారి వీధి-2లోని వ్యభిచార గృహంపై శనివారం వన్‌టౌన్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో మహిళను రక్షించారు. నిర్వాహకురాలికి సహకరిస్తున్న ఇంకో వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

6న ప్రతిభా పురస్కారాల ప్రదానం

తెనాలి: ది అమరావతి మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ, పోస్ట్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6న వివిధ రంగాల్లో ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సమావేశానికి హాజరై వచ్చిన విద్యార్థిని గాదిశెట్టి మోహన లక్ష్మీ ప్రియాంక, క్రికెట్ కోచ్ షేక్ కరిముల్లా మాలిక్, యువ వ్యాపారవేత్త హరిబుద్ధ కౌముద్ నారాయణ్, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, బాడీ బిల్డర్ తన్నీరు లక్ష్మణ్, చార్టర్డ్ అకౌంటెంట్ జొన్నాదుల భార్గవ్, మానవతావాది సూదా పిచ్చయ్య, ప్రతిభా విద్యార్థిని తన్నీరు మానస బిందుకు పురస్కారాలను అందజేయనున్నారు. పోస్ట్ సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు, సొసైటీ చైర్మన్ తన్నీరు నాగమల్లేశ్వరి దేవి శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు.

పేదలకు చేరువైన వైద్యం



పాత ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్



రోగులకు పరీక్షిస్తున్న డాక్టర్ బీబీజాన్



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్లు

- అర్బన్ హెల్త్ సెంటర్లతో నైణ్యమైన వైద్య
- తెనాలి పట్టణంలో నూతనంగా ఐదు ఏర్పాటు
- కొనసాగుతున్న సేవలు

తెనాలిఅర్బన్: నాణ్యమైన వైద్యాన్ని ప్రజల చెంతకు ప్రభుత్వం తీసుకువచ్చింది. చిన్న చిన్న వ్యాధులకు దూరప్రాంతాలకు వెళ్లకుండా.. డాక్టర్ వైఎస్సార్ పట్టణ అర్బన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి, వైద్యాన్ని చేరువ చేసింది. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించింది. ఇళ్ల వద్దకే (ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్) వైద్యులను పంపి, వైద్య సేవలు అందించే సదుపాయాన్ని కల్పించింది. దీంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆర్థిక భారం తప్పినట్లు అయ్యింది. తెనాలి పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురయితే.. చెంచుపేటలోని జిల్లా వైద్యశాలకు వెళ్లాల్సిందే. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. వైద్య శాఖలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రతి వార్డుకు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని సాలిపేటలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌తో పాటు.. అయిదు నూతన సెంటర్లను ఏర్పాటు చేశారు. పాత ప్రభుత్వ వైద్యశాలలో, సుల్తానాబాద్‌లో, నేలపాడు రోడ్డులో, చంద్రబాబు నాయుడు కాలనీ, ఆలపాటి నగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి నిర్మాణం కోసం (ఒక్కొక్క దానికి రూ.1.10 కోట్లు) రూ.5.50కోట్ల నిధులను వెచ్చించారు. నిర్మాణం పూర్తిచేసుకున్న పాత ప్రభుత్వ వైద్యశాల, సుల్తానాబాద్‌లోని హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఇటీవల ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు. మిగిలిన మూడు నిర్మాణ దశలో ఉన్నాయి.

వసతులు ఇలా..

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఒక మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు-2, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, ఫార్మసిస్ట్ ఒకరు, డీఈవో ఒకరు, ఎల్‌జీఎస్ ఒకరు ఉంటారు. ఓపీ గది, ల్యాబ్, మందులు ఇచ్చే గది, మైనర్ ఆపరేషన్ థియేటర్, డెలివరీల కోసం లేబర్ రూం, పది పరుపుల వార్డు, గాయాలకు డ్రెస్సింగ్ చేసే గది, మీటింగ్ హాల్ కూడా నిర్మాణంలో భాగం. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రతి రోజు సగటున 60 నుంచి 70 మంది రోగులు వచ్చి, చికిత్స పొందుతుంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

ప్రజాభిమానం..

అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రజాభిమానం పొందుతున్నాయి. రోగులు తమ వెంట చిన్న పుస్తకం తెచ్చుకుని, వ్యాధులకు సంబంధించిన వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. వారికి ఇచ్చే ట్రీట్‌మెంట్ వివరాలను దానిలో పొందుపరుస్తున్నారు. మరలా ఎప్పుడు ఆస్పత్రికి రావాలనే వివరాలు కూడా నమోదు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల అనుకోకుండా ఏదైన ప్రమాదం సంభవిస్తే వైద్యులకు వారి అనారోగ్య వివరాలు తెలిసే అవకాశం ఉంది. తద్వారా చికిత్స కూడా త్వరగా అందించేదుకు దోహద పడుతుంది. రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్ ఉండటం వల్ల షుగరు, ఇతర వ్యాధులకు పరీక్షలు చేసి, వెంటనే రిపోర్టు ఇస్తున్నారు. రోగులకు అవసరమైన 175 రకాల మందులు, ఇంజక్షన్లు హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి. కుక్క, పాము కాటు ఇంజక్షన్లు, సెలైన్ బాటిళ్లు, ప్రసవం చేసే సమయంలో ఇంజక్షన్లు, యాంటీ బాటిక్స్, నొప్పుల మందులు, కంటి, చెవిలో వేసే డ్రాప్స్ బాటిల్స్ ఇలా అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అలాగే చిన్న పిల్లలకు, గర్భిణులకు వాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని బుధ, శనివారాల్లో ఇక్కడ వేస్తున్నారు.

పేదలకు సేవ ఆనందాన్ని ఇస్తోంది



ఎంబీబీఎస్ పూర్తయిన మాకు.. సీఎం వైఎస్‌జగన్ అర్బన్ హెల్త్ సెంటర్లల్లో ఉద్యోగాలు ఇచ్చారు. పేదలకు వైద్య సేవలు అందించడం.. ఆనందాన్ని ఇస్తోంది. అన్ని రకాల పరీక్షలతో పాటు వైద్యాన్ని అందిస్తున్నాం. అశ, ఏఎన్ఎంలతో వార్డుల్లోని గర్భిణులను గుర్తించటం, వారికి రెగ్యులర్‌గా చెకప్‌లు చేస్తున్నాం. డెలివరీ అయిన 45 రోజుల వరకు వారిపై మా పర్యవేక్షణ ఉంటూనే ఉంటుంది.

–డాక్టర్ బీబీజాన్, మెడికల్ ఆఫీసర్, అర్బన్‌హెల్త్ సెంటర్, తెనాలి

వైద్యం బాగా అందిస్తున్నారు



గతంలో చిన్న రోగానికి కూడా జిల్లా వైద్యశాలకు వెళ్లాల్సి వచ్చేది. అర్బన్ హెల్త్ సెంటర్లతో దూరం తగ్గి ఇక్కడే చికిత్స పొందుతున్నాం. నేను రెండు నెలల నుంచి షుగర్ కు చికిత్స పొందుతున్నాను. వైద్యులు, సిబ్బంది బాగా చూస్తున్నారు.

–సుబ్బయ్య, నందులపేట, తెనాలి

అన్ని ఉచితంగా చేస్తున్నారు



వృద్ధాప్యంలో అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన తర్వాత చాలా వరకు ఆ ఇబ్బందులు తొలగాయి. చిన్న రోగం వచ్చినా వెంటనే ఇక్కడికి వచ్చి చికిత్స పొందుతున్నాం. ఇక్కడ పరీక్షలు, మందులు అన్ని ఉచితంగా ఇస్తున్నారు.

–విజయ కుమారి, బుర్రిపాలెం రోడ్డు, తెనాలి.